అలరించిన సినీ సంగీత విభావరి



చిక్కడపల్లి: సాహిత్య సంగీత సాంస్కృతిక సమన్వయ సంస్థ ఆధ్వర్యంలో శారదా కల్చరల్ స్టూడియోలో ఆదివారం రాత్రి నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులు గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. ఈ సందర్భంగా గద్వాల సోమన్న రచించిన 'మిఠాయి పొట్లం'పుస్తకాన్ని ఏపీ మైన్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వీడీ రాజగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం ప్రముఖులు మహర్షి వాల్మీకి, మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి, గుర్రం జాషువా, సాలూరి రాజేశ్వర్‌రావులను స్మరించుకుంటూ నిర్వహించిన కవి సమ్మేళనంలో కవులు, కవయిత్రులు పాల్గొని స్వీయ కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు సాలూరి వాసురావు, రాధిక, సిధారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరమణ, బయ్యపురెడ్డి, సుబ్రహ్మణ్యం, విజయ రామరాజు, ఉషారాణి, విజయలక్ష్మి, రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

టోలిచౌకి పీఎస్‌లో రాజాసింగ్‌పై ఫిర్యాదు

గోల్కొండ: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వాఖ్యలు చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై పలువురు ముస్లింలు టోలిచౌకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం జిబ్రాన్, షాహిన్‌షా తదితరులు టోలిచౌకి ఇన్‌స్పెక్టర్ రమేష్‌నాయక్‌ను కలిసి రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో సాబేర్‌ఖాన్, అఫ్సర్ జాహి, రషీద్ తదితరులున్నారు.

వేడుకగా ముదిరాజ్‌ల అలయ్ బలయ్

కాచిగూడ: సికింద్రాబాద్ ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముదిరాజ్‌ల అలయ్ బలయ్ వేడుకలు ఘనంగా జరిగాయి. అలయ్ బలయ్ కార్యక్రమానికి అంబర్‌పేట, కాచిగూడ ప్రాంతాల నుంచి ముదిరాజ్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్, లోకనబోయిన రమణ ముదిరాజ్, మేకల సాగరంగ పాణి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్గి ఉండాలి

సుల్తాన్‌బజార్: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, డైరెక్టర్ ఆఫ్ హాస్టల్స్, హైదరాబాద్ జూబ్లీహిల్స్ బ్రాంచ్ లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఆదివారం కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయంలో మానసిక ఆరోగ్యం, శ్రేయస్సు అనే అంశంపై ఒక్కరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 250 మంది డిగ్రీ హాస్టల్ బోర్డర్లు పాల్గొన్నారు. ఈ సెషన్‌లో విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, శ్రేయస్సుకుపై అవగాహన కల్పించారు. అలాగే నిరాశను అధిగమించడం, స్వీయ ప్రేమ, సానుకూల స్వభావం, తమతో తాము కనెక్ట్ అవ్వడం, భావోద్వేగం, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడాని ధ్యానం ప్రాముఖ్యత వంటి కీలక అంశాలపై ఈ అవగాహన సదస్సు జరిగింది. ఇలాంటి సదస్సులు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతాయని వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ అన్నారు.

భాగ్యలక్ష్మి ఆలయం వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి

చార్మినార్: దీపావళిని పురస్కరించుకుని ఆరు రోజుల పాటు నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని..వీరి సౌకర్యార్థం ఉచితంగా పార్కింగ్ సౌకర్యం కోసం తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయ ట్రస్టీ సూర్య ప్రకాష్, బీజేపీ సీనియర్ నాయకులు ప్యారసాని వెంకటేష్ కోరారు. చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే దీపావళి వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు దీపావళి వేడుకలు వైభవంగా జరుగనున్నాయని.. భక్తుల సౌకర్యార్థం చార్మినార్ పరిసరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల 20న ఆలయంలో పూజలు నిర్వహించనున్నామని..ఈ పూజల్లో పాల్గొనాలని ఏసీపీని కోరామన్నారు.

ఉండలేం.. వెళ్లలేం!

ఇక్కడ ఉండలేని దుస్థితి.. బయటకు వెళ్లలేని పరిస్థితి

- దివ్యాంగ వసతి గృహంలో వసతుల లేమి
- ముద్దన్నం, నీళ్లచారుతో మింగుడు పడని ముద్ద
- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు
- శిథిలావస్థ భవనంలో బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు



సమస్యలు పరిష్కరించాలంటూ అధికారులను నిలదీస్తున్న దివ్యాంగ విద్యార్థులు (ఫైల్)

అది పేరుకే సంక్షేమ హాస్టల్.. మరుగుదొడ్లకు తలుపులుండవు.. తలుపులు ఉంటే నీళ్లురావు..పురాతన శిథిలావస్థకు చేరిన భవనం, హాస్టల్ భవనంలోని గదుల ముందే నిత్యం మురుగు పరుగు. దోమలు, ఈగలు, ఎలుకలు, బొద్దింకల స్వైర విహారం. దుప్పట్లు లేక చలికి గజగజ వణుకు అది చాలదన్నట్లు తినేందుకు వీలుపడని రాళ్లు, ఇసుకతో ముద్దన్నం నీళ్లచారు, ఉడికీ ఉడకని కూరలతో ముద్ద మింగుడు పడని దుస్థితి. ఇదీ చంపాపేట డివిజన్ రెడ్డికాలనీలోని ప్రభుత్వ బాలుర దివ్యాంగ విద్యార్థుల హాస్టల్ దుస్థితిపై ప్రత్యేక కథనం.
– చంపాపేట



అధ్వానంగా మరుగుదొడ్లు

విద్యార్థులు.. ఆరుగురు సిబ్బంది..

నాలుగు దశాబ్దాల పురాతన శిథిలావస్థకు చేరిన అద్దె భవనంలో 19 సంవత్సరాలుగా హాస్టల్ కొనసాగుతుంది. వసతి గృహంలో 195 మంది వికలాంగ విద్యార్థులు ఉంటూ ఉన్నత చదువులు, పోటీ పరీక్షలకు పుస్తకాలతో కుస్తీ పడుతూనే మౌలిక సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. వికలాంగ విద్యార్థుల వసతి గృహంలో కనీస సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయిస్తున్నామని ప్రచార ఆర్భాటాలు చేస్తున్న ప్రస్తుత పాలకులు క్షేత్రస్థాయిలో ఆచరణ మాత్రం శూన్యమని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ పది మంది విద్యార్థులకు ఒక సహాయకుడిని నియమించాల్సి ఉండగా హాస్టల్‌లో కేవలం వార్డెన్, కుక్‌లతో కలిసి మెత్తం ఆరుగురు సిబ్బందితో కానిచ్చేస్తున్నారు.

కాస్మోటిక్స్, ఖర్చులు కట్..

గత రెండు సంవత్సరాలుగా నోట్ పుస్తకాలు, కాస్మోటిక్స్, ఇతర ఖర్చుల కోసం నెలకు అందించే రూ.200 మంజూరు కావడం లేదని దీంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులందరికీ సరిపోడే స్నానాల గదులు, మరుగు దొడ్లు ఉన్నప్పటికీ కొన్నింటికి తలుపులు లేక నిరుపయోగంగా ఉన్నాయని, స్నానాల గదులు, మరుగు దొడ్లు, డైనింగ్ హాల్, వాష్ ఏరియాను నిత్యం అపరిశుభ్రంగానే ఉంటుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కటిక నేలపై బొద్దింకలు, ఈగలు, దోమలు స్వైర విహారం నడుమే చలికి వణుకుతూ నిద్రించాల్సి దుస్థితి ఏర్పడుతుంది.

గదుల ముందే మురుగు పరుగు..

హాస్టల్ భనంలోని డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరటంతో నిత్యం విద్యార్థుల గదుల ముందే మురుగు పరుగు పెడుతూ గడపదాటి బయటకు రాలేని దుస్థితి ఉందని బోరుమంటున్నారు. నాసిరకం, కల్తీతో కూడిన మటన్, ఉడికీ ఉడకని కూరలు, అన్నంలో పురుగులు, మెరిగలు, రాళ్లు, మట్టి పెడ్డలు వస్తున్నాయని ఇదేమని ప్రశ్నిస్తే వార్డెన్ నిర్లక్ష్యంగా సమాధానమిస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

ఇంత నిర్లక్ష్యమా



శిథిలావస్థకు చేరిన భవనంలో మౌలిక వసతులు లేక సమస్యలతో సహజీవనం చేయాల్సిన దుస్థితి ఉంది. తినడానికి అన్నం సరిగ్గా ఉండదు.. గదులు ముందే మురుగు పరుగు. కిటీకీలకు తలుపులు, దోమతెరలు లేవు. మరుగుదొడ్లలో ముక్కుపుటలదిరే దుర్వాసన వస్తోంది. వికలాంగులంటే ఇంత నిర్లక్ష్యమా.. ఉన్నతాధికారులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి.
– అందె రాంబాబు, వికలాంగుల హక్కుల పోరాట సమితీ జాతీయ కార్యవర్గ సభ్యులు

నూతన భవనంలోకి మార్చాలి..



19 ఏళ్లుగా పురాతన భవనంలో మురుగు పరుగు, ఎలుకలు, బొద్దింకలు నడుమ సహజీవనం చేస్తున్నాం. పేరుకే మటన్ కర్రీ.. కల్తీ పదార్థాలత వండుతున్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఆందోళన చేస్తే దివ్యాంగ సంక్షేమ శాఖ అధికారులు తూతూ మంత్రంగా ఏర్పాట్లు చేసి ఆ తర్వాత ఇటువైపు కన్నెత్తి చూడరు. ఇక్కడ ఉండలేని దుస్థితి.. బయటకు వెళ్లలేని పరిస్థితి. ఉన్నతాధికారులు స్పందించకుంటే నిరాహార దీక్షలు చేపట్టి ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభింపచేస్తాం.
– రామ్‌చందర్, పీజీ విద్యార్థి

మున్నూరుకాపుల సంక్షేమానికి కృషి చేస్తా



సమావేశంలో రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ పూర్వ అధ్యక్షుడు గంప చంద్రమోహన్

చిక్కడపల్లి: మున్నూరుకాపుల సంక్షేమానికి అహర్నిషలు కృషి చేస్తానని రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ పూర్వ అధ్యక్షుడు గంప చంద్రమోహన్ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ, ముషీరాబాద్ నియోజవర్గం మున్నూరుకాపు సంఘం సంయుక్తాధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంప చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన మున్నూకాపు విద్యార్థులకు విద్యానిధిని రూ.5లక్షలతో ప్రారంభించి కోటి రూపాయలను నిధులను సేకరించి స్కాలర్‌షిపులను అందజేస్తామన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయిలో పర్యటించి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని అన్నారు. మున్నూరుకాపులు ఐక్యంగా ఉండి విద్య, ఆర్థిక, రాజకీయంగా అన్ని రంగాలలో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే సంఘం ఎన్నికల్లో గంపా చంద్రమోహన్‌ను ఎన్నుకోవాలని నియోజవర్గం మున్నూరుకాపు సంఘం కన్వీనర్ గంగంరవి, అధ్యక్షుడు రెబ్బరామారావు, ప్రధాన కార్యదర్శి కుడిదిరాజు, కార్యదర్శి దామోదర్‌లు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో నేతలు శ్రీనివాస్, మారిశెట్టినర్సింగ్‌రావు, ఉదయ్, గాదె శ్రీనివాస్, దోసేటి సత్యం, భానుచందర్, రాకేష్‌కుమార్, గడ్డమీది శ్రీనివాస్‌స కుమారస్వామి, జర్నలిస్ట్ చిలుకూరి అఖిలేష్, రవ్వరాజు, సుధాకర్, జి.గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ కళలను భావితరాలకు అందించాలి

గన్‌ఫౌండ్రీ: భారత శాస్త్రీయ సంగీత కళలను భావి తరాలకు అందించాలని ప్రముఖ నాట్య గురువు డాక్టర్ ఆర్.ప్రసన్నరాణి అన్నారు. ఆదివారం ఆదర్శనగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో ముద్ర మంజీరం పేరిట నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కూచిపూడి, భరతనాట్యం వంటి కళలను నేటి తరానికి చేరవేయడంలో కళా సంస్థల పాత్ర కీలకమన్నారు. అనంతరం పలువురు నాట్య గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సినీనటి సంధ్య జానకి, ఫిట్నెస్ ట్రైనర్ అను ప్రసాద్, నటుడు సుమిత్ రాయ్, ఆర్‌జే శేఖర్ బాషా, సంస్థ వ్యవస్థాపకురాలు విజయమాధవి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో నాట్య గురువు ప్రసన్నరాణి తదితరులు

కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయం



సత్కార గ్రహీతలతో ప్రముఖులు శ్రీనివాస్, లోకనాథశర్మ, సువర్ణ లత

చిక్కడపల్లి: నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో 50వ అఖిల భారత సంగీత నృత్య పోటీల స్వర్ణోత్సవాల జరుగుతున్నాయి. ఆదివారం చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో సునాద వినోదిని శీర్షికతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం ఆకట్టుకుంది. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ... కళలకు సహకరిస్తూ యువ కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. గతంలో సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారిని ఒకే వేదికపై తీసుకొచ్చి సత్కరించడం అపూర్వమైన సాంస్కృతి సమ్మేళనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు టి.శ్రీనివాస్, లోకనాథశర్మ, సువర్ణలత, ప్రకాష్, అనురాధ, సుధామాల, ఇందిరాహేమ, మధుమతి, వేమరాజు, విజయకుమార్, జంటనగరాల కళాకారులు పాల్గొన్నారు.

గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్

కాచిగూడ: రాజకీయాలకు అతీతంగా హిందూ రాజ్య స్థాపనే లక్ష్యంగా బజరంగ్ సేన నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు శివ ప్రసాద్ అన్నారు. ఆదివారం హర్రాజ్‌పెంటలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గో రక్షణ, హిందూ ధర్మ పరిరక్షణ, దేవాలయ పరిరక్షణతో పాటు లవ్ జీహాద్, మతమార్పిడులకు వ్యతిరేకంగా భజరంగ్ సేన రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతోందని తెలిపారు. గోవులను హింసించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టమని పేర్కొన్నారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బజరంగ్ సేన నూతన కార్యవర్గాన్ని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గిరిధర్ గోపాల్, రాఘవేంద్ర, డాక్టర్ రాంబాబు, మల్లికార్జున్, నవనీత్ మహేష్, ప్రవీణ్ దేవే తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవం

కాచిగూడ: సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం ఇసామియా బజార్ అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్ గుప్తా తెలిపారు. ఆదివారం బాలకృష్ణ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

లంబాడీల అస్తిత్వం కోసం ఉద్యమాలు చేస్తాం

సుల్తాన్‌బజార్: కొందరు గిరిజన, గోండు తెగకు చెందిన రాజకీయ నాయకులు అగ్రవర్ణ పెట్టుబడిదారుల చేతుల్లో కీలుబొమ్మగా మారి లంబాడి గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేయడం అప్రజాస్వామికమని లంబాడి జేఏసీ కన్వీనర్ జాటోత్ కిషన్ నాయక్ అన్నారు. ఆదివారం కోఠి హనుమాన్‌టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జేఏసీ కన్వీనర్ కిషన్ నాయక్ మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధంగా గిరిజన జాబితాలో ఉన్న లంబాడిలను దూషించే వారిని దేశద్రోహులుగా నమోదు చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించిందన్నారు. లంబాడి హక్కులను కాపాడుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను చేస్తామన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని పరిరక్షించుకోవాలి

గన్‌ఫౌండ్రీ: సమాచార హక్కు చట్టాన్ని రక్షించుకుని అమలు చేసుకోవాల్సిన బాధ్యత పౌర సమాజానిదేనని సమాచార హక్కు చట్టం కమిషన్ చైర్మన్ పీవీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో సమాచార హక్కు చట్టం సాధన సమితి ఆధ్వర్యంలో సమాచార చట్టం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక మంది త్యాగాల ఫలితంగానే సమాచార హక్కుచట్టం ఏర్పడిందని గుర్తుచేశారు. ఈ చట్టం అమలులో అధికారులు పారదర్శకంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

సరళ పదాలతో దినవహి సత్యవతి రచనలు



చిక్కడపల్లి: మహిత సాహితీ సాంస్కృతిక సంస్థ, త్యాగరాయ గానసభల సంయుక్త ఆధ్వర్యంలో దినవహి సత్యవతి రచించిన సంక్షిప్త రామాయణం, సుందరకాండ, సప్తపదులు సంపుటీల ఆవిష్కరణ ఆదివారం జరిగింది. ప్రముఖ రచయిత, విమర్శకులు విహారి ముఖ్యఅతిథిగా హాజరై సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. సరళ పదాలతో అందరినీ ఆసక్తిగా చదివించేలా సంపుటీలు ఉన్నాయని అన్నారు. సుందర నాగమణి ఆవిష్కరించిన సంపుటిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు సుధామ, శ్రీపాద స్వాతి, కార్యదర్శి ఎస్.మాధవి, ప్రముఖులు మాధవి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ శాంతి అవార్డుకు వెంకటేష్ ఎంపిక



కాచిగూడ: బీజేపీ సీనియర్ నేత పొట్లకాయల వెంకటేష్ ముదిరాజ్‌ను మహాత్మా గాంధీ శాంతి అవార్డు-2025కు ఎంపిక చేసినట్లు సహకార్ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల హేమంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీన బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో మహాత్మగాంధీ జయంతి ఉత్సవాల ముగింపు వేడుకల్లో ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చుక్కల మందుకు చక్కటి స్పందన



ముషీరాబాద్, అంబర్‌పే నియోజకవర్గాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ కోరారు. సమాజంలో పోలియో మహమ్మరిని తరిమికొట్టేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి అన్నారు. పోలియో మహమ్మారిని రూపు మాపేందుకు చిన్నారుల తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరూ పాటు పడాలని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ విన్నవించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయిస్తే ఎలాంటి అంగవైకల్యం రాదని డీబీఆర్ మిల్ హెల్త్‌సెంటర్ డా. అవంతి తెలిపారు. పోలియో రహిత సమాజ స్థాపనకు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కల మందు వేయించాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు.
– ముషీరాబాద్, అంబర్‌పే జోన్‌బృందం



సురభి హైస్కూల్‌లో చిన్నారులకు చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్



బాగ్‌లింగంపల్లి బస్తీ దవాఖానాలో పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి







ముషీరాబాద్‌లో చుక్కల మందు వేస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్



డీబీఆర్ మిల్ హెల్త్‌సెంటర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న డా. అవంతి

రాజకీయంగా ఎదిగినప్పుడే దళితులకు సమన్యాయం



తెలంగాణ రాష్ట్ర దళిత ఐక్య వేదిక దసరా మిలాప్‌లో అభివాదం చేస్తున్న నాయకులు

ముషీరాబాద్: దళితులు రాజకీయంగా, విద్యాపరంగా ఎదిగినప్పుడే సమాజంలో సమన్యాయం లభిస్తుదని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మెన్. శ్రీనివాస్‌రావు సూచించారు. ఆదివారం రాంనగర్‌లోని ఎస్ఆర్‌టీ గ్రౌండ్‌లో తెలంగాణ రాష్ట్ర దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో దసరా సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు నాయకులు పూమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గంలో ఐక్య వేదిక కార్యాలయం ఏర్పాటుకు అందరూ ఐక్యంగా కృషి చేస్తే సాధించుకోవచ్చని ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. ఐక్య వేదిక కన్వీనర్ వివేక్ మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా త్వరలో నూతన కమిటీలు వేసి ఐక్య వేదికను మరింత బలోపేతం చేస్తామన్నారు. కమిటీల నియామకాల్లో యువతకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ఐక్య వేదిక కన్వీనర్ వివేక్, శ్యాంసుందర్ అధ్యక్షత వహించిన సభకు కార్పొరేటర్ రచనశ్రీ, రాష్ట్ర దళిత ఐక్య వేదిక నాయకులు నవీన్, గజ్జల సూర్యనారాయణ, గండి కృష్ణమాదిగ, మల్లేష్, సదానంద్, స్వామి, గిరి, నందగిరి నర్సింహ, నర్సింగ్‌రావు, సంఘపాక భాస్కర్, వై.శ్రీనివాసరావు, హరీష్, భాస్కర్, రమేష్, జనార్దన్ హాజరయ్యారు.